క్లుప్తంగా

ఎన్నికల విధులపై అలసత్వం వద్దు

జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గురజాల : ఎన్నికల విధులపై ఎవరూ ఆలసత్వం వహించ వద్దని జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు ఉండేలా చూడాలని, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీస్‌లు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాకాంత్ రెడ్డి, తహసీల్దార్‌లు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కాలువలకు అడ్డు వేస్తే చర్యలు తప్పవు

మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



గురజాల : కాలువలకు ఎవరైనా అడ్డు వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాసరావు అన్నారు. కాలువ పరిధిలోని పలు చెక్ డ్యామ్‌లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ నుంచి చెరువుకు నీటిని పెడుతున్నామని కాలువల్లో రైతులు అడ్డుకట్ట వేసి పొలాలకు నీరు పెట్టుకుంటున్నారని అలా చేయరాదన్నారు. మంచి నీటికి ఇబ్బందులు తలెత్తకుండా చెరువులు నింపే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రైతులు సహకరించి అడ్డు వేయరాదన్నారు. అడ్డు వేసిన వాటిని తొలగించారు.

ప్రత్యేక ఆర్టీసీ బస్సులు



మాచర్ల: మహాశివరాత్రి, సాగర్‌మాత మహోత్సవాల సందర్భంగా గురువారం నుంచి మాచర్ల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం, సత్రశాల, దైద, తేరాల, మన్నేపల్లికి, విజయపురిసౌత్‌లోని సాగర్ మాత దేవాలయానికి బస్సు సరీ్వసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రమశిక్షణ కలిగిన విద్యతోనే ఉన్నత శిఖరాలు

మిట్టగుడిపాడు(రెంటచింతల): ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగిన విద్యను పట్టుదలతో అభ్యసించినప్పుడే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అన్నారు. బుధవారం మిట్టగుడిపాడు గ్రామ సమీపంలోని కస్తూర్బా పాఠశాలను ఆమె సర్పంచ్ గొట్టం వెంకటేశ్వరరెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ మీకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా?.. మీ క్లాస్‌లో ఎంతమంది విద్యార్థినులు ఉన్నారు.. మీకు ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు అర్థమవుతున్నాయా.. స్టడీ అవర్స్ జరుగుతున్నాయా.. వంటివి అడిగి తెలుసుకున్నారు. మీరందరూ ఇష్టంతో ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వైద్యశాలలో పింఛన్ అందజేత

గురజాల : వైద్యశాలలో చికిత్స పొందుతున్న



వృద్ధాప్య పింఛన్‌దారుడికి పింఛన్ అందించారు. కాటూరి వైద్యశాలలో అనారోగ్యంతో గత పది రోజులుగా చికిత్స పొందుతున్న గురజాల మండలం గంగవరం గ్రామానికి చెందిన పాత వెంకటేశ్వర్లుకు వలంటీర్ షేక్ మహమ్మద్ ముస్తఫా వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందించారు. పింఛన్ అందుకున్న పింఛన్‌దారుడు హర్షం వ్యక్తం చేశాడు.

పట్టణంలో అగ్ని ప్రమాదం

మాచర్ల: పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం పక్కన ఎండాకాలంతో పాటు, ఆకతాయి బాలురు వలన ఆకస్మికంగా బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. పక్కనే నిర్మిస్తున్న రోడ్డు నిమిత్తం పాత జెడ్పీ కార్పెంటర్ ఐటీఐ భవనంలో తారు డబ్బాలు ఉంచారు. ఈ ప్రాంతంలో చెట్లు పెరగగా ఆకతాయిలు నిప్పు వేశారు. ఆ మంటలు చెలరేగి తారు డబ్బాలకు అంటుకొని సుమారు రూ.60వేల ఆస్తి దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పి పెద్ద ప్రమాదం జరగకుండా చూశారు.

ఆదరణ చూపారు..అభివృద్ధి చేశారు

నాడు..

గతంలో పంచాయతీ కార్యాలయం తప్ప ప్రభుత్వ కార్యాలయాలు గ్రామంలో ఏమీ లేవు. ప్రధాన రహదారి సరిగా లేక, వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న పరిస్థితులుండేవి.

నేడు..

తాగునీటి ఇబ్బందులు లేవు. గ్రామ ప్రధాన రహదారితో పాటు అంతర్గత రోడ్లు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, కో ఆపరేటివ్ గోడౌన్, కరెంటు ఆధునికీకరణ పనులు, పాఠశాలల అభివృద్ధితో ఇతర అభివృద్ధి పనులతో గ్రామ ముఖ చిత్రం మారింది.

- మారిన పేటసన్నెగండ్ల గ్రామ ముఖ చిత్రం
- సంక్షేమం ద్వారా ప్రతి గడపకు సగటున రూ.1.75 లక్షల లబ్ధి
- గ్రామంలో సుమారు రూ.11 కోట్లతో అభివృద్ధి



ప్రభుత్వ కార్యాలయాల సముదాయం



కారెంపూడి: పేటసన్నెగండ్ల గ్రామంలో సుమారు రూ.11 కోట్లు అభివృద్ధి పనులకు మంజూరయ్యాయి. అందులో రూ.4.7 కోట్లతో పనులు జరగాల్సి ఉంది. వాటిలో రూ.20 లక్షలతో బల్క్ మిల్క్ సెంటర్ నిర్మాణం సగం వరకు జరిగింది. పేటసన్నెగండ్ల లిఫ్ట్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి, గ్రామంలోని చెరువుకు నీరందించేందుకు మైనర్ ఇరిగేషన్ శాఖ రూ.1.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. అదే విధంగా గ్రామంలో 33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి.

ప్రతి గడపకు సగటున రూ.1.75 లక్షల లబ్ధి..

ఇదిలా ఉంటే గ్రామంలో ప్రతి గడపకు సగటున రూ.1.75 లక్షల వరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది. ఒక్కొక్కరికి రూ.1.5 లక్షల విలువైన సెంటున్నర స్థలం చొప్పున 175 మందికి పట్టాలివ్వడం జరిగింది. 705 మందికి వివిధ రకాల పింఛన్‌లు ప్రతి నెలా అందిస్తున్నారు.

గ్రామ నేపథ్యం..

గ్రామంలో ఎక్కువ మంది విద్యావంతులు, రాజకీయంగా చైతన్యం ఉన్న గ్రామం. ఇక రాజకీయం విషయానికి వస్తే టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి మెజార్టీ వచ్చే గ్రామం. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 260 ఓట్ల మెజార్టీ రావడంతో గ్రామాభివృద్ధికి నాంది పలికింది. సుమారు నాలుగు దశాబ్దాలుగా టీడీపీ నాయకులదే హవా. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే పీఆర్కే ఆధిక్యత సాధించారు. దానికి తగినట్లుగానే ఆయన గ్రామాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చారు.



గ్రామానికి వేసిన బీటీ రోడ్డు



అభివృద్ధి చేసిన పాఠశాల భవనం

అభివృద్ధి ఇలా..

గ్రామ ప్రధాన రహదారి నిర్మాణం	రూ.78 లక్షలు
సచివాలయ భవనం	రూ.43 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.20 లక్షలు
వైఎస్సార్ హెల్త్ క్లినిక్	రూ.20 లక్షలు
8 సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైన్స్ నిర్మాణం	రూ.85 లక్షలు
కో ఆపరేటివ్ గోడౌన్	రూ.15 లక్షలు
16 బోర్ వెల్స్, 8 మినీ వాటర్ ట్యాంకులకు	రూ.16.8 లక్షలు
మొత్తం కరెంటు అభివృద్ధి పనులు	రూ.3 కోట్లు
నాడు–నేడు కింద 4 స్కూల్స్ అభివృద్ధి	రూ. 40 లక్షలు
రెండు బీసీ, ఓసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణం	రూ. 23.5 లక్షలు

గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి..



గతంలో గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దాఖలాలు లేవు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గ్రామాభివృద్ధికి ఇది కావాలని అడగగానే వెంటనే నిధులు మంజూరు చేయించారు. చేసిన అభివృద్ధి స్పష్టంగా కన్పిస్తూనే ఉంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. తమ వంశస్తులు గ్రామ సచివాలయ నిర్మాణానికి 20 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు.

– కొంగర సుబ్రమణ్యం, పేటసన్నెగండ్ల

అభివృద్ధిలో పాలు పంచుకున్నందుకు గర్వంగా ఉంది..



గతంలో చర్చికి రూ.10 లక్షల విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చా. ఇప్పుడు కొత్తగా మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి కోటి విలువైన అర ఎకరం స్థలాన్ని విరాళంగా ఇచ్చాను. ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రత్యేక శ్రద్ధతో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలలో పాలు పంచుకుంటున్నందుకు గర్వంగా ఉంది.

– వెన్నపూసల బుల్లెబ్బాయి, పేటసన్నెగండ్ల

గ్రామ అభివృద్ధికి చేయూత..



అభివృద్ధి బ్రహ్మాండంగా జరిగింది. గ్రామానికి అన్నీ సమకూరాయి. మంచినీటి సమస్య తీరింది. ఇవే కాక ప్రతి గడపకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా సగటున ఇప్పటికి రూ.1.75 లక్షల లబ్ధి చేకూరింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. చర్చిలు, అన్ని కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు కూడా ప్రభుత్వ విప్ పీఆర్కే చేయూతనిచ్చారు.

– మాచర్ల ఏడుకొండలు, పేటసన్నెగండ్ల

రైతుల ప్రయోజనాల కోసం నిరంతర విద్యుత్



నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

విజయపురిసౌత్: రైతుల ప్రయోజనాల కోసం నాగులవరం, చింతలతండా గ్రామాల మధ్య రూ.7 కోట్లతో 33 కేవీ నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మాచర్ల మండలం చింతలతండా గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం భూమి పూజ చేసి, శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. చింతలతండా, నాగులవరం, అనుపు, బెల్లంకొండ వారి పాలెం గ్రామాల రైతులకు ఈ సబ్‌స్టేషన్ ద్వారా నాణ్యమైన అంతరాయం లేని పగటిపూట 9 గంటల విద్యుత్ అందించటంతో పాటు గృహ, వాణిజ్య వినియోగదారులకు లో ఓల్టేజ్ సమస్య తీరుతుందన్నారు. రైతన్నల కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మనమందరం అండగా ఉండి రాబోయే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ ఈఈ కె.హరిబాబు, డీఈ ఏ రామయ్య, ఏఈ ఎం.రాంబాబు, మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ నాయకుడు బూడిద శ్రీను, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత, ఎంపీటీసీ సీతానాయక్, ఉప సర్పంచ్‌లు వస్త్రపురి రాములు, లచ్చు, మాజీ ఎంపీటీసీ బద్దెల శ్రీను, పార్టీ నాయకులు పెరుమాళ్ళ వెంకట్రామయ్య, గొట్టిముక్కలు ఏడుకొండలు, గంటా శ్రీధర్, హనుమంతునాయక్, పొందుగుల సత్యనారాయణరెడ్డి, ఐనబోయిన శ్రీను, బత్తుల కోటేశ్వరరావు, చవ్వా రాజశేఖర్, మాణిక్యంనాయక్, నాగులవరం సర్పంచ్ గోగిరెడ్డి వెంట్రావమ్మ, వెంకటేశ్వరరెడ్డి, చింతలతండా సర్పంచ్ కేతావత్ శ్రీనునాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి సాగర్‌మాత మహోత్సవాలు



ముస్తాబైన సాగర్‌మాత దేవాలయాలు



సాగర్‌మాత దేవాలయంలో ఉన్న జపమాల క్షేత్రం

విజయపురిసౌత్: సర్వ మతాల సంగమంగా, ఆధ్యాత్మిక భావనకు ప్రతీకగా వెలుగొందుతున్న సాగర్ మాత మహోత్సవాలను ఈ నెల 7, 8, 9 తేదీలలో ఘనంగా జరపడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం సాగర్‌మాత ఆలయానికి రాష్ట్రంలోనే విశిష్టత కల్గిన దేవాలయంగా పేరుంది. భక్తుల కోర్కెలు తీర్చే తల్లి సాగర్‌మాత ఆలయానికి నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. దేశంలోనే భారతీయ సంప్రదాయ రీతులలో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా దీన్ని చెబుతారు. ధూప, దీప, నైవేద్యాలు, తలనీలాలు సమర్పించటం వంటి కార్యక్రమాలు పూర్తిగా హిందూ పద్ధతిలో జరిగే క్రైస్తవ ఆలయం ఇది. ఈ మందిరానికి 1977 అక్టోబర్ 10వ తేదిన అప్పటి గుంటూరు మండల పీఠాధిపతి కాగితపు మరియదాసు ప్రారంభోత్సవం చేశారు. 2011 మార్చి 6న కృష్ణానదీ తీరంలో నిర్మించిన జపమాల క్షేత్రాన్ని గుంటూరు పీఠాధిపతులు గాలి బాలి ప్రారంభోత్సవం చేశారు. ఏసుక్రీస్తు జననం నుంచి మరణం వరకు ఆయన జీవిత చరిత్ర గురించి ఏర్పాటు చేసిన 20 జపమాల స్థలాలు, ధ్యానమందిరం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గత ఏడాది సాగర్‌మాత దేవాలయంపై, ఆలయంలో 14 స్థలాల విగ్రహాలపై దేవదూతల విగ్రహాలను విచారణ గురువులు హృదయ్‌కుమార్ ఏర్పాటు చేశారు. ఉత్సవాల నేపథ్యంలో 7వ తేదీ నుంచి 9వ తేది వరకు సాగర్‌మాత పుణ్యక్షేత్రంలో దివ్యసత్ప్రసాదన నిత్య ఆరాధనలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరపబడతాయి. ఉదయం 5.30 గంటలకు సాగర్‌మాత విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్‌చే, 6.30 గంటలకు గురుశ్రీ జోసఫ్ తంబి అన్నెంచే దివ్యబలిపూజ, 10 గంటలకు గోరంట్ల గురు గోపు జోసఫ్‌చే జపమాల, స్తుతి ఆరాధన, మధ్యాహ్నం 1 గంటకు అన్నదాన కార్యక్రమం, 2 గంటలకు గురు గోపు జోసఫ్‌చే వాక్య పరిచర్య, స్వస్థతా ప్రార్థనలు, 5.30 గంటలకు గురు అల్లం చిన్న శౌరెడ్డిచే దివ్యబలిపూజ, వాక్య పరిచర్య, 7.30 గంటలకు కొవ్వత్తులతో తేరు ప్రదక్షిణ, రాత్రి 8 గంటలకు సాగర్‌మాత కళాకారుల బృందం సంసోను–డెలీల బుర్రకథ, రాత్రి 9 గంటలకు రక్తబలి బైబిల్ నాటకం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇదే తరహాలో 8, 9తేదీలలో కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఎంతో మేలు

ఎంపీపీ సంపూర్ణమ్మ

మిట్టగుడిపాడు(రెంటచింతల): గ్రామాలలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష వలన పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అన్నారు. బుధవారం మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో సర్పంచ్ గొట్టం వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్తులకు అవసరమైన వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు, కళ్లద్దాలను ఇవ్వడం జరుగుతందన్నారు. కుటుంబ ఆరోగ్య విషయాలను ఒక యాప్‌లో నమోదు చేసి, ఆ యాప్ సమాచారం ఆధారంగా తదుపరి చికిత్సలు ఎక్కడ చేయించాలన్న దానిపై కచ్చితమైన అవగాహన ఉంటుందన్నారు. గ్రామంలోని ప్రతి ఇంట్లో ఎవరికి ఎలాంటి వైద్య సహాయం కావాలో, ఏఏ మందులు అవసరమో తెలుస్తుందన్నారు. ఇలా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వైద్యం అందించే కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అమలు చేసారన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులను సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కె.ప్రదీప్‌రెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సురక్ష కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ, సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి

వైభవంగా గంగమ్మ తల్లి కలశ ప్రతిష్ట

దుర్గి: మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామంలో గంగమ్మ తల్లి ఆలయంలో కలశ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు పాల్గొన్నారు. గ్రామస్తులు వారికి ఘనంగా స్వాగతం పలికి పలువురు నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆశీస్సులతో పాడి పంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలందిస్తానన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పీఆర్కే, పీవీఆర్ చేతుల మీదుగా కలశ ప్రతిష్ట నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాలి రామయ్య, గుండాల వెంకట రామయ్య, బుర్రి కాశయ్య, జడ కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మ తల్లి ఆలయంలో పిన్నెల్లి సోదరులు

భక్తుల కొంగు బంగారం మల్లన్న

- విశ్వామిత్ర మహర్షి తపస్సు చేసిన పుణ్యస్థలం
- ఏకశిల నంది విగ్రహం..అతి పెద్ద శివయ్యను చూడతరమా
- 11 ఆలయాల కొలువైన సత్రశాల దేవస్థానం

సత్రశాల (రెంటచింతల): మండల కేంద్రమైన రెంటచింతలకు సుమారు 12 కి.మీ.ల దూరంలో పవిత్ర కృష్ణానది తీరాన వేంచేసి ఉన్న అత్యంత పురాతన ప్రముఖ శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం మహాశివరాత్రి పర్వదినానికి సిద్ధమైంది. అనాదిగా ఈ దేవస్థానం భక్తులపాలిట సంతాన మల్లయ్య గాను.. కొంగుబంగారంగా విరాజిల్లుతుంది. సంతానం కలగని మహిళ ఇక్కడి స్వామివారిని ఆలింగనం చేసుకుంటే సంతానం కలుగుతందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. విశ్వామిత్ర మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేశారని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తుంది. తాను చేస్తున్న కఠోర తపస్సును భగ్నం చేసిన కాకులను విశ్వామిత్ర మహర్షి శపించడం వలన ఈ ప్రాంతంలో కాకులు మచ్చుకైనా కనిపించవు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మహాశివరాత్రి పర్వదినం రోజు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. శ్రీశైలం తరహాలో ఇక్కడ కూడా వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 20 అన్నదాన సత్రాలు ఉన్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున ఆయా వర్గాల వారికి భోజనం ఏర్పాటు చేస్తారు.



గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం

అతి పురాతన శైవక్షేత్రం..

రాష్ట్రంలోని అతిపురాతనమైన శైవ క్షేత్రాలలో సత్రశాల మల్లిఖార్జునస్వామి దేవస్థానం ఒకటి. ఈ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖలతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు సైతం ప్రతి ఏటా వస్తుంటారు. మాచర్ల నుంచి పాలువాయిజంక్షన్, పశర్లపాడు, జెట్టిపాలెం గ్రామాల మీదుగా సత్రశాలకు చేరుకోవచ్చు. ఆలయ ప్రాంగణంలోనే రామాలయం, కుమారస్వామి, ఆంజనేయస్వామి, ఉత్తరేశ్వర, చెన్నకేశవస్వామి, కాలభైరవ, అన్నపూర్ణాదేవి, కాశీవిశ్వేర, వెంకటేశ్వరస్వామి, చీకటి మల్లయ్య స్వామి, అమరలింగేశ్వర స్వామి ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ ఉన్న ఏకశిల నంది విగ్రహం, అతి పెద్ద శివయ్య విగ్రహం, స్ఫటిక లింగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున ఏర్పాటు చేసే విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులు తెల్లవార్లు జాగారం చేస్తుంటారని దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బ్రహ్మారెడ్డి, కార్యనిర్వాణాధికారి బుర్రి నెమిలిరెడ్డి తెలిపారు.



ఆకట్టుకుంటున్న ఏకశిల నంది విగ్రహం

బాలల హక్కులపై అవగాహన



పిడుగురాళ్ల రూరల్: శిశు హత్యలు మహాపాతకమని, అలాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఐసీడీసీ సీడీపీవో శ్రీవల్లి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి మండల పరిషత్ పాఠశాలలో బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు విద్యలో ఉన్నతంగా రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు, లింగ వివక్ష, మానసిక, శారీరక అంశాలు, అత్యవసర పరిస్థితుల్లో 1098 నెంబర్‌కు ఫోన్‌చేసి, ఎలా రక్షించుకోవాలో అనే అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుదురాళ్ల: ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అన్నారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ కార్యాలయంలో మేము సిద్ధం.. మా బూతు సిద్ధం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఆ పథకాల గురించి ప్రతి ఒక్క ఇంటికి వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీకి ఓటు వేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మనం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి మనల్ని గెలిపిస్తాయన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త సిద్ధంగా ఉండి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, కౌన్సిలర్లు కె.శ్రీను, జూలకంటి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓపెన్ ఆడిటోరియం ప్రారంభం

మాచర్ల: పట్టణంలోని జెడ్పీహెచ్ బాలికోన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ ఆడిటోరియం ఎండీ, ట్రస్టీ మాటూరి సరోజనీ బుధవారం ప్రారంభించారు. రూ.3 లక్షల వ్యయంతో అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఓపెన్ ఆడిటోరియంను ప్రారంభించటం సంతోషకరమన్నారు. ఎన్‌ఆర్‌ఐ షేక్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని ఎంఈవో సురేష్, బిగ్ హెల్ప్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కర్‌బాబులు అన్నారు. బిగ్ హెల్ప్ చేస్తున్న సేవలను హెచ్‌ఎం షేక్ సకీనా, రిటైర్డ్ ఎంఈవో వీరయ్య చౌదరి, హెచ్‌ఎం రామారావు, మేనేజర్ ధనలక్ష్మిలు కొనియాడారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సత్రశాల దేవస్థానంలో పంచలోహ విగ్రహాల ప్రతిష్ట

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన ప్రముఖ శైవ క్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో పలు దేవతా మూర్తుల పంచ లోహ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఈవో బుర్రి నెమిలిరెడ్డి బుధవారం తెలిపారు. భక్తుల సహాయ సహకారాలతో తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, గంగా పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి, సువర్చల సమేత ఆంజనేయ స్వామి తదితర పంచలోహ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు సహకారం

మాచర్ల: పల్నాడు జూనియర్ కళాశాల నిర్వాహకులు, రోటరీ క్లబ్, మాచర్ల ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఆర్టీసీ మహాశివరాత్రి, సాగర్‌మాత తిరునాళ్లలో పనిచేసే ఉద్యోగులకు టోపీలు, బ్యాడ్జి, విజిల్స్‌ను బుధవారం డిపో మేనేజర్ ఆర్ పిచ్చయ్య ఆధ్వర్యంలో అందించారు. డీఎం మాట్లాడుతూ రోటరీ క్లబ్, మాచర్ల, పల్నాడు జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలలో భాగంగా తమకు సహకరిస్తున్నారన్నారు. ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇశ్రాయేలు, జోజి, డైరెక్టర్లు నాగూర్‌వలి, శివభాస్కర్, వెంకట నారాయణ, శాస్త్రి, మస్తాన్‌వలి, డాక్టర్ రామకోటయ్య, కాశి పాల్గొన్నారు.